సాక్షి
ఖమ్మం
దీపావళి శుభాకాంక్షలు

సోమవారం । 20 । అక్టోబర్ । 2025

దీప కాంతులు.. బాంబు మోతలు!

దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. ఇంటింటా దీపాల వెలుగులు, బాణసంచా మోతలతో సందడి చేయనున్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ ఆర్ డిగ్రీ కళాశాల మైదానం, పెవిలియన్ గ్రౌండ్‌లో 128 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇవ్వగా విక్రయాలు మొదలయ్యాయి. రంగు రంగుల కాంతులతో నిప్పులు విరజిమ్మే చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, భారీ శబ్దాలు చేసే బాంబులతో పలు రకాల బాణసంచా అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఖమ్మంలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి బాణసంచా కొనుగోలుదారుల సందడి..


ఓ దుకాణంలో బాణసంచా కొనుగోలు చేస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

వైన్స్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంక్రైం: వైన్స్ షాపుల దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 23 వరకు పొడిగించింది. జిల్లాలో 116 వైన్స్‌కు శనివారం వరకే దరఖాస్తులు స్వీకరిస్తామని తొలుత ప్రకటించారు. ఈమేరకు శనివారం రాత్రి 11 గంటల వరకు మొత్తం 4,043 దరఖాస్తులు అందగా ఎక్సైజ్ శాఖకు రూ.121.29కోట్ల ఆదాయం లభించింది. అయితే, బీసీల బంద్ కారణంగా బ్యాంకులు తెరుచుకోక డీడీలు తీయలేకపోయామని పలువురు విన్నవించడంతో రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తు గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. కాగా, 27వ తేదీ డ్రా తీసి వైన్స్ కేటాయిస్తామని వెల్లడించారు.

అప్రమత్తతతోనే ప్రమాదాలు దూరం

నేలకొండపల్లి: దీపావళి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని, ఇదే సమయాన బాణసంచా కాల్చే విషయంలో అప్రమత్తంగా ఉండాలని 108 సర్వీసుల ఉమ్మడి జిల్లా మేనేజర్ పి.శివకుమార్ సూచించారు. నేలకొండపల్లిలో ఆదివారం 108 వాహనం పనితీరు, రికార్డులను పరిశీలించాక ఆయన మాట్లాడారు. టపాసులు కాల్చే సమయాన అజాగ్రత్తగా ఉండడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు పిల్లలు కాల్చే సమయాన పెద్దలు పర్యవేక్షించాలని, ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాన 108 సేవలను వినియోగించుకోవాలని, తమ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

ఎంపీ దీపావళి శుభాకాంక్షలు

ఖమ్మం మామిళ్లగూడెం: దీపావళి పండుగతో పాటు సదర్ ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై విజయం సాధించడానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అలాగే, యాదవ సమాజం అన్ని జాగ్రత్తల నడుమ సదర్ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు.

ఎత్తులు.. పై ఎత్తులు !


- హోరాహోరీగా రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ


విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మం టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ నిర్వహించారు. అండర్ – 8, 10, 12, 14 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించగా వివిధ జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-8 బాలుర విభాగంలో లావుడ్యా చౌహాన్, కార్తికేయ, దర్శన్‌రెడ్డి, ఈశ్వర్, హర్ష, అండర్-10లో శివనాగసాయి, అరిహంత్, గౌతమ్‌కృష్ణ, నిఖిల్‌చంద్ర, విశ్వతేజ, అండర్-12లో ఎస్.గౌతమ్ చంద్రమోహిత్, రామ్ నిఖిత్, భూక్యా తనీష్, ఆర్యన్‌శర్మ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు. అలాగే, బాలికల అండర్-8 విభాగంలో సహస్ర, సామికా, తేజశ్రీ, జిహిత, జితిషా, అండర్-10లో అంధ్య, అనికారామ్, కార్తీక్ ప్రణవ్, అధ్విక గౌరీ, శరణ్యప్రియ, అండర్-12లో భవజ్ఞ, రీతూశ్రీ, కృతధార, నిహారిక, దిలీషా, అండర్-14 బాలికల విభాగంలో లక్ష్మి, హర్షిత, శ్రీసాత్విక, సిరిలయ, ఆరాధ్య మొదటి ఐదు స్థానాల్లో నిలవగా నిర్వాహకులు బహుమతులు అందజేశారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రఫీ, ఆర్గనైజర్ టి.వీరన్నతో పాటు శివకృష్ణ, కావ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యం, కష్టపడే తత్వం ఉంటే ఏదైనా సాధించొచ్చని నిరూపిస్తున్నారు నేటి తరం అమ్మాయిలు. డాక్టర్ కావాలనే పట్టుదలతో కష్టపడి చదివి మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధిస్తున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది. కొన్నేళ్ల క్రితం వరకు మెడిసిన్‌లో అమ్మాయిల సంఖ్య తక్కువగానే ఉండేది. కానీ తెలంగాణ ఏర్పడ్డాక జిల్లాకొక ప్రభుత్వ మెడికల్ కాలేజీ రావడం.. అందుబాటులో అన్ని వసతులు ఉండడంతో అబ్బాయిలతో పాటు అమ్మాయిలు సైతం ఇటువైపు దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది ఖమ్మం మెడికల్ కాలేజీలో వంద సీట్లకు గాను 82 మంది అమ్మాయిలే ప్రవేశాలు పొందడం విశేషం. –ఖమ్మంవైద్యవిభాగం

సగం కాదు.. అంతకంటే ఎక్కువే!



ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అమ్మాయిలే అధికం

- 100 సీట్లకు 82 మంది విద్యార్థినులు
- గత రెండు బ్యాచ్‌ల్లోనూ అగ్రభాగాన వారే..


వైట్ కోట్ సెర్మనీ సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

2023లో కళాశాల ఏర్పాటు

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటు చేయగా, 2023 అక్టోబర్‌లో మొదటి సంవత్సరం బోధన ప్రారంభమైంది. మొత్తం 100 సీట్లతో కళాశాల ఏర్పాటు కాగా జాతీయ కోటాలో 15 శాతం, రాష్ట్ర కోటాలో 85 శాతం సీట్లు కేటాయించారు. హైదరాబాద్, వరంగల్ తర్వాత విశాలంగా ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో ఖమ్మం మెడికల్ కళాశాల నిలుస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రితో పాటు కళాశాల, హాస్టళ్లు కలుపుకుని సుమారు 30 ఎకరాల మేర స్థలం ఉంది. అంతేకాక నగర నడిబొడ్డున కళాశాల ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది లేనందున ఇక్కడ చేర్పించేందుకు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాక హాస్టళ్లలో సీసీ కెమెరాల పర్యవేక్షణ, నిరంతరం సెక్యూరిటీ, విశాలమైన తరగతి, ప్రాక్టికల్ గదులు ఉండడంతో నీట్ ర్యాంకర్ల చూపు ఇటువైపు తిప్పేలా చేస్తోంది.

మూడు బ్యాచ్‌ల్లోనూ వారే..

ఖమ్మం మెడికల్ కాలేజీకి అవసరమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లను కేటాయించడంతో బోధన సాఫీగా సాగుతోంది. కళాశాలలో ఈ ఏడాది 100 సీట్లలో 82 మంది విద్యార్థినులు ప్రవేశాలు పొందారు. వీరిలో చాలా మంది నిరుపేదలు, రైతు కుటుంబాలు, చిరువ్యాపారుల కుటుంబాల నుంచే వచ్చారు. అలాగే, గత ఏడాది 56 మంది, అంతకు ముందు ఏడాది 71 మంది అమ్మాయిలు చేరి ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నారు. తద్వారా మూడు బ్యాచ్‌ల్లోనూ అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారు.

జిల్లా విద్యార్థినులకు ప్రయోజనం

గతంలో ఎంబీబీఎస్ సీటు సాధించటం కష్టమైన వ్యవహారంగా ఉండేది. కానీ ప్రస్తుతం అమ్మాయిలు చదువులో రాణిస్తూ లక్ష్యం వైపు కదులుతున్నారు. మూడు బ్యాచ్‌ల్లో చూస్తే 30 మంది జిల్లా విద్యార్థినులు ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లు సాధించారు. మెరుగైన ర్యాంకుతో స్థానికంగా సీట్లు సాధిస్తుండడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా జిల్లాలోనే చదివే అవకాశం రావడం.. అనుకున్నట్లుగానే గత రెండేళ్లలో మంచి ఫలితాలు రావడంతో ఈసారి కూడా విద్యార్థినులు ఇటే మొగ్గు చూపారు. అంతేకాక జాతీయ కోటాలో మహారాష్ట్ర, రాజస్తాన్, ఢిల్లీ, హరియాణా, కేరళ రాష్ట్రాల విద్యార్థులు 45 మంది చదువుతున్నారు.

ఉత్తమ వసతులు, బోధన



కళాశాలలో వసతులకు తోడు ఉత్తమ బోధన అందుతోంది. గత రెండు బ్యాచ్‌ల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో ర్యాంకర్లు ఇక్కడ చేరుతున్నారు. అందులో అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారు. విద్యార్థులకు పటిష్టమైన భద్రత ఉండడంతో చదువు సాఫీగా సాగుతోంది.

– డాక్టర్ శంకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

వ్యవసాయ కుటుంబం నుంచి..



మాది వ్యవసాయ కుటుంబం. మొదటి నుంచి స్థానికంగానే చదువుకున్నా. డాక్టర్ కావాలనే నా లక్ష్యానికి కుటుంబీకుల ప్రోత్సాహం ఉండడంతో సీటు సాధించా. ఖమ్మం మెడికల్ కాలేజీలోనే సీటు రావడంతో కుటుంబ సభ్యులు సంతోషించారు.

– జి.తేజస్విని, కామేపల్లి

గైనిక్ విభాగంలో పీజీ చేస్తా..



ఎంబీబీఎస్ సీటు ఖమ్మం ప్రభుత్వ కాలేజీలో రావడంతో మా తల్లిదండ్రులు గర్వపడుతున్నారు. ఎంబీబీఎస్ తర్వాత గైనిక్ విభాగంలో పీజీ చేయాలని నిర్ణయించుకున్నా. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన సేవ చేయడమే నా లక్ష్యం.

– కె.లక్షిత, ఖమ్మం

పేదలకు సేవే లక్ష్యం



కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించా. నిరుపేదలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే వైద్య రంగంలోకి వచ్చా. ఖమ్మం కళాశాలలో బోధన బాగుందని గత ఫలితాల ద్వారా తెలియడంతో ఇక్కడే అడ్మిషన్ పొందా.

– జి.శాలిని, ఖమ్మం


అర్ధరాత్రి ఏసీబీ సోదాలు


- అంతర్రాష్ట్ర ఆర్టీఏ చెక్ పోస్టుల్లో తనిఖీలు
- లెక్కకు మించి ఉన్న నగదు స్వాధీనం
- రికార్డులను వెంట తీసుకెళ్లిన అధికారులు


పెనుబల్లి: ముత్తగూడెం చెక్‌పోస్టు నుంచి రికార్డులు తరలిస్తున్న ఏసీబీ అధికారులు

పాల్వంచరూరల్/అశ్వారావుపేట/పెనుబల్లి: అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు ఉమ్మడి జిల్లాలోని అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో సోదాలు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఆర్టీఏ చెక్ పోస్టుల్లో తనిఖీలు చేపట్టారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో పాల్వంచ మండలం జగన్నాథపురం, నాగారం కాలనీ గ్రామాల మధ్య బీసీఎం జాతీయ రహదారిపై ఉన్న చెక్‌పోస్టులో దాడులు నిర్వహించారు. కంప్యూటర్ డేటా, రికార్డులతోపాటు చెక్‌పోస్టులోఉన్న అధికారి, సిబ్బంది సెల్‌ఫోన్లను కూడా తనిఖీ చేశారు. ఓవర్‌లోడ్ ఫైన్, ట్యాక్స్ కలెక్షన్ వంటి విషయాల్లో డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలపై తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. లెక్కలో లేని రూ.26 వేల నగదు లభించిందని పేర్కొన్నారు. దొరికిన నగదు వ్యవహారంపై ఎంవీఐ, సిబ్బందిపై చర్యలకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు సమాచారం. కాగా ఇదే చెక్ పోస్టులో గతేడాది ఆగస్టులో కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. అశ్వారావుపేట ఆర్టీఏ చెక్‌పోస్టులో కూడా ఏసీబీ అధికారులు దాడులు చేశారు. పెనుబల్లి మండల పరిధి లోని ముత్తగూడెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. సీజ్ చేసి తమ వెంట తీసుకెళ్లారు. రికార్డుల ప్రకారం ఉండాల్సిన సొమ్ము కంటే అదనంగా రూ.6,660 ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టీసీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రదీప్, వీరేష్


ప్రదీప్‌కుమార్


వీరేష్‌గౌడ్

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. అలాగే, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.వీరేష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరం గురవారెడ్డి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఖమ్మం వచ్చిన అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి డాక్టర్ ప్రదీప్, వీరేశ్‌గౌడ్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ క్రికెటర్లను ప్రోత్సహించడానికి టీసీఏ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రదీప్, వీరేష్ మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, జిల్లాలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా క్రికెటర్ల ఎంపిక చేపడతామని వెల్లడించారు.

ఇందిరా డెయిరీ నా చిరకాల వాంఛ

- పాల ఉత్పత్తులతో దేశానికే ఆదర్శంగా నిలవాలి
- వైరా అభివృద్ధికి నిధులు.. అక్కడి నుంచే ఈ స్థాయికి చేరా
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


బోనకల్: మహిళల అభిప్రాయాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన కలెక్టర్ అనుదీప్


మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌తో భట్టి కరచాలనం

బోనకల్/వైరా : పాల ఉత్పత్తులతో మధిర నియోజకవర్గ మహిళలు దేశానికే ఆదర్శంగా నిలవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుతో తన చిరకాల వాంఛ నెరవేరుతుందని తెలిపారు. బోనకల్‌లో ఆదివారం ఆయన నియోజకవర్గ పరిధిలోని ఇందిరా మహిళా డెయిరీ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2013లో మధిర నియోజకవర్గంలో 52వేల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండేసి గేదెలు పంపిణీ చేసి డెయిరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కానీ అదే సమయాన రాష్ట్ర విభజన జరగడం, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆలస్యమైందని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మధిర నియోజకవర్గంలోని మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న తన లక్ష్యం నెరవేరడానికి మార్గం ఏర్పడిందని తెలిపారు.

రెండేసి గేదెలు.. సోలార్ ప్లాంట్లు

ప్రతీ సభ్యురాలికి రెండేసి గేదెలు పంపిణీ చేయడమే కాక పాకల నిర్మాణం, సోలార్ ప్లాంట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని భట్టి వివరించారు. అలాగే, దాణా సరఫరా బాధ్యతను నిరుద్యోగ యువతకు అప్పగించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, రాష్ట్ర హస్తకళలు, గిడ్డంగుల సంస్థల చైర్మన్లు నాయుడు సత్యం, రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, ఆర్అండ్‌బీ, పీఆర్, విద్యుత్ శాఖ, భగీరథ ఎస్ఈలు యాకోబు, వెంకటరెడ్డి, శ్రీనివాసాచారి, శేఖరరెడ్డి, ఆర్డీఓ నర్సింహారావు, ఏడీఏ విజయచందర్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ ఆర్.రమాదేవి పాల్గొన్నారు.

వైరాకు మరిన్ని నిధులు..

వైరా అభివృద్ధికి భవిష్యత్‌లో మరిన్ని నిధులు మంజూరు చేస్తానని, ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులతోనే ఈస్థాయికి చేరానని భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం వైరాలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వైరాలో రూ. 500 కోట్లతో త్వరలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేస్తామన్నారు. అంతకుముందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, వైద్యులు కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబుతో పాటు 100 కుటుంబాల వారు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, ఏదునూరి సీతారాములు, బొర్ల గంగారావు, దాసరి దానియేలు పాల్గొన్నారు.

తుది నిర్ణయం ఏఐసీసీదే..

- డీసీసీ, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- డీసీసీకి 56, నగర అధ్యక్ష పదవికి 10 దరఖాస్తులు
- ఏఐసీసీ పరిశీలకులు మహేంద్రన్ వెల్లడి


మహేంద్రన్‌తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా, నగర అధ్యక్ష పదవులకు నాయకుల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అధ్యక్ష పదవులకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఏఐసీసీ పరిశీలకులు మహేంద్రన్ వారం రోజుల క్రితం ఖమ్మం చేరుకున్నారు. తొలి రోజు నుంచే దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత ప్రతీ నియోజకవర్గంలోని రెండు బ్లాక్‌ల్లో సమావేశాలు నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. మొత్తంగా ఆయన 3,700 మందితో మాట్లాడారు. అధ్యక్ష పదవులకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారం ముగియగా.. డీసీసీ అధ్యక్ష పదవికి 56 మంది, నగర అధ్యక్ష పదవికి 10 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారందరితోనూ మహేంద్రన్ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధ్యక్ష పదవులకు వచ్చిన దరఖాస్తుల్లో జిల్లాకు 6, నగరానికి 6 దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసి 25వ తేదీ లోగా ఏఐసీసీకి అందజేస్తామని తెలిపారు. అందులో నుంచి ఒకరిని డీసీసీ అధ్యక్ష పదవికి, ఒకరని నగర అధ్యక్ష పదవికి ఎంపిక చేస్తారని వివరించారు. కాగా, జిల్లా పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణం అయిన మహేందరన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కార్పొరేటర్ రాపర్తి శరత్ తదితరులు కలిశారు.

కల్లూరుకు సరికొత్త శోభ

- రూ.49 కోట్లతో ఇంటిగ్రేటెడ్ సబ్‌కలెక్టర్ కార్యాలయ నిర్మాణం
- మంత్రి తుమ్మల సూచనలతో ప్రతిపాదనలు


మంత్రి తుమ్మలతో సమావేశమైన సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్

సత్తుపల్లి/కల్లూరు : సుమారు పది ఎకరాల స్థలంలో రూ.49 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టర్ కార్యాలయ నిర్మాణం జరగనుండగా కల్లూరు కొత్తశోభ సంతరించుకోనుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట కొలువుదీరేలా దీనిని డిజైన్ చేశారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టర్ కార్యాలయంగా ఇది రూపుదిద్దుకుంటుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో ఈ మేరకు ప్రతిపాదనలను సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ సిద్ధం చేసి ఆదివారం మంత్రికి అందజేశారు. అంతేకాక సబ్‌కలెక్టర్ క్యాంప్ కార్యాలయాన్ని మరో రూ.2.50 కోట్లతో ప్రతిపాదించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండడంతో ప్రజలకు మెరుగైన సేవలు సులువుగా అందుతాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించాక ప్రతిపాదనలు ఆమోదం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, ప్రభుత్వ, ఎన్నెస్పీ భూములను పరిరక్షించాలని, సత్తుపల్లి వేశ్యాకాంతల చెరువులో ఆక్రమణలు తొలగించాలని మంత్రి సూచించారు. అంతేకాక వేంసూరు మండలం కుంచపర్తి గ్రామంలో గ్రామకంఠం భూములను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని తెలిపారు.



దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవు..

సత్తుపల్లి: సిద్ధాంతపరంగా విభేదాలు సాధారణమే అయినప్పటికీ, ఈ ముసుగులో దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు హెచ్చరించారు. సత్తుపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. ఇటీవల బంద్ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోతు విజయ్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని, వీరిపై కేసులు నమోదు చేయకపోతే దీపావళి తర్వాత ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఖమ్మం సీపీతో మాట్లాడారని చెప్పారు. అంతేకాక దాడిపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కాగా, బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, రిజర్వేషన్లలో మతపరమైన అంశాలు ఉండడంతోనే ఆమోదం పొందలేదన్నారు. అయినా బీసీల హక్కుల సాధనకు బీజేపీ పోరాడుతుందని తెలిపారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు విజయ్‌ను పరామర్శించారు. ఈ సమావేశంలో పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ నాయకులు ఈ.వీ.రమేష్, నున్నా రవి, సుదర్శన్ మిశ్రా, మట్టా ప్రసాద్, పాలకొల్లు శ్రీనివాస రావు, బాలకృష్ణారెడ్డి, వందనపు భాస్కర్‌రావు పాల్గొన్నారు.











ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


అండర్-17 బాలుర జట్టుతో కోచ్‌లు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ఈ ఎంపిక పోటీలు జరిగాయి. పోటీలకు 40 మంది బాలలు, 30 మంది బాలికలు హాజరు కాగా.. వివిధ పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికల ప్రక్రియను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వై.రామారావు, బాస్కెట్‌బాల్ కోచ్‌లు పీ.వీ.రమణ, కృష్ణమూర్తి, రామారావు, భరత్‌చంద్ర పర్యవేక్షించారు.

జట్లు ఇవే...

అండర్-17 బాలుర బాస్కెట్‌బాల్ జట్టుకు అక్కి ఆయాన్, కె.స్నేహిత్, యశ్వంత్, హర్షవర్ధన్, సాత్విక్, సుమంత్, జెస్సు కిరణ్, చరణ్, సూర్య, గౌతమ్ సాహూ, ఎం.సాకేత్, రేహాన్, రైసింగ్, ఎస్.సాకేత్, అభినవ్, విశ్వతేజ, ఛత్రపతి శివాజీ, ఎండీ.గౌస్ అస్లాం ఎంపియ్యారు. అలాగే, బాలికల జట్టులో పి.అఖిల, రిశివశ్రీ, పూనం హన్సీ, సహస్ర, ఓంకారుణ్య, ఆయుషాన్వి, కీర్తి స్వప్నిక, తమస్ వి.తమరిత, చందనశ్రీ, దీక్షిత, యక్షిత, సాత్విక, ధతి, మనస్విని, కీర్తన, బి.హరిణి, కె.రితికాశాస్త్ర, కె.గ్రేస్‌కు స్థానం దక్కింది.

పురుగు మందులు స్వాధీనం

కారేపల్లి: అనుమతి లేకుండా గ్రామాల్లో తిరుగుతూ పురుగు మందులు అమ్ముతున్న నలుగురిని కారేపల్లి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన నలుగురు కారేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో తిరుగుతూ మంచి ఫలితాన్ని ఇస్తాయని రైతులకు నమ్మబలుకుతూ పురుగు మందులు అమ్ముతున్నారు. ఈమేరకు అందిన సమాచారంతో వారిని కారేపల్లి ఎస్ఐ బి.గోపి అదుపులోకి తీసుకొని వ్యవసాయ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఓ బట్టు అశోక్‌కుమార్ చేరుకుని వారి నుంచి ఆరు రకాల పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏఓ తెలిపారు.

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో సోమవా రం జరిగే గిరిజన దర్బార్‌ను రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బిరాహుల్ ఆదివా రం ప్రకటనలో తెలిపారు. సోమవారం దీపావళి పండుగ కావడంతో దర్బార్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.









అరెస్టులతో సమ్మెను ఆపలేరు


కార్మికులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఖమ్మంమయూరిసెంటర్: తగ్గించిన వేతనాలు పెంచాలని, జీఓ 60 ప్రకారం రూ.15,600 వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు 38 రోజులుగా సమ్మె చేస్తూ మంత్రులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల జేఏసీ రాష్ట్ర నాయకులు కె.బ్రహ్మాచారి అన్నారు. ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో విధులు నిర్వర్తిస్తున్న డైలీ వేజ్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఖమ్మంలో మంత్రుల క్యాంపు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించేందుకు ఎన్నెస్పీ క్యాంపునకు చేరుకున్నారు. మూడు జిల్లాల నుంచి వచ్చిన కార్మికులను పోలీసులు ఎన్నెస్పీ క్యాంపులో అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాచారి మాట్లాడుతూ 38 రోజుల్లో 20 సార్లు ఆర్థిక శాఖ మంత్రికి తమ గోడు వినిపిస్తూ వినతిపత్రం ఇచ్చామని, అయినా స్పందన లేదని అన్నారు. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన గిరిజన కార్మి కులను అరెస్టు చేయించడం దుర్మార్గమని అన్నారు. డైలీ వేజ్ వర్కర్లకు టైం స్కేల్ అమలు చేయాలని, అప్పటి వరకు కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ వర్కర్లకు ఉట్నూరు, ఏటూరు నాగారం ఐటీడీఏ పరిధిలో రూ.15,600 వేతనం చెల్లిస్తుంటే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం రూ.9,200 మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. అరెస్టులతో సమ్మె ఆపలేరని, సమస్యలు పరిష్కరించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని వెల్లడించారు.సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జెల్లా ఉపేందర్, దొడ్డా రవికుమార్, నాగేశ్వర రావు, అనంతరాములు, లక్ష్మణ్, మోహన్, కౌసల్య, నర్సింహ రావు, లక్ష్మి, శ్రీను, హీరా లాల్, ముత్తయ్య, మంగమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.





అండర్-19 బ్యాడ్మింటన్, కరాటే జట్ల ఎంపిక


జిల్లా బాలబాలికల కరాటే జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్, కరాటే జట్ల ఎంపిక పోటీలు ఆదివారం ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపిక పోటీలను కోచ్‌లు జి.రాము, గోపతి సైదులు ఎస్.కే.ఖాసీం, ఎం.బాబు, ఎండీ. మహబూబ్, ఎం.సురేష్, హరీష్, ఎం.సందేష్ పర్యవేక్షించగా జట్ల వివరాలను అండర్-19 క్రీడల కార్యదర్శి ఎం.డీ.మూసా కలీం ప్రకటించారు. అండర్-19 బ్యాడ్మింటన్ బాలుర జట్టుకు ఎస్.నవీన్ ఉదయ్, ఎం.రాజీవ్, డి.నవీన్, ఎ.అరవింద్, జి.నవదీప్, బాలికల జట్టులో బి.ధరణి ప్రియ, ఎ.రష్మి, కె.హెమీమా, ఎస్.గాయత్రి, జి.మహాలక్ష్మి స్థానం దక్కించుకున్నారు. అలాగే, కరాటే జట్టులో వివిధ కేటగిరీలకు గాను కె.అరుణతేజ్, డి.గౌరీశంకర్, కె.హర్షతేజ, కె.గణేష్, షాహిద్, ఎం.డీ. అసదుద్దీన్, ఎస్.కే.రియాన్, ఎం.లాస్యశ్రీ, వి.లక్ష్మీశ్రావణి, బి.సహస్రసేన్, ఎం.డీ.హఫషాజబీన్, కె.నిఖిత ఎంపికయ్యారు.

నిర్లక్ష్య వైద్యానికి నిండు ప్రాణం బలి..

- వందనంలో ఇంటర్ విద్యార్థి మృతి
- ఇంజక్షన్ వికటించడంతో మృతి చెందాడని కుటుంబసభ్యుల ఆరోపణ
- మృతదేహంతో అర్‌ఎంపీ ఇంటి ఎదుట ఆందోళన

చింతకాని: ఓ గ్రామీణ వైద్యుడి(ఆర్‌ఎంపీ) నిర్లక్ష్యానికి ఇంటర్ విద్యార్థి బలయ్యాడు. తెలిసీ తెలియని వైద్యంతో జ్వరంతో వచ్చిన విద్యార్థికి ఇంజక్షన్ ఇవ్వడంతో అది కాస్తా వికటించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీంతో విద్యార్థి కుటుంబసభ్యులు మృతదేహంతో గ్రామీణ వైద్యుడి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని వందనం గ్రామానికి చెందిన ఉద్వి జస్వంత్ (17) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో హాస్టల్లో ఉంటూ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. జ్వరం రావడంతో కుటుంబసభ్యులు ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తీసుకొచ్చి అదే రోజు కొదుమూరు గ్రామంలోని గ్రామీణ వైద్యుడికి చూపించాడు. అతడు ఓ ఇంజక్షన్ వేయగా.. వెంటనే వాంతులు చేసుకొని అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. దీంతో తల్లిదండ్రులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కొద్దిసేపటికి మృతి చెందాడు. ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ విద్యార్థి తల్లిదండ్రులు గ్రామీణ వైద్యుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై వీరేందర్, ఏఎస్సై లక్ష్మణ్ అక్కడకు చేరుకొని కుటుంబసభ్యులతో చర్చలు జరుపుతున్నారు. మృతికి కారకుడైన గ్రామీణ వైద్యునిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రొటోవేటర్ తగిలి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

రఘునాథపాలెం: రొటోవేటర్ ఫిట్టింగ్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు ఓ ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మరబండ గ్రామానికి చెందిన మాదాసు నారాయణ (35) మంచుకొండలోని ఖాసీమ్‌కు చెందిన మామిడి తోటలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం రొటోవేటర్‌ను ట్రాక్టర్‌కు ఫిట్టింగ్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు తలకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి వద్ద నాగార్జున సాగర్ కాలువలో గుర్తు తెలియని ఓ వ్యక్తి(34) మృతదేహం లభ్యమైంది. మద్దులపల్లి గ్రామ శివారులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రావు సహకారంతో పల్లెగూడెం బ్రిడ్జి వద్ద మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.









